క్లుప్తంగా

ప్రతిభా అవార్డుకు దీప్తి ఎంపిక

నర్సీపట్నం: కారుణ్య స్కూల్ విద్యార్థిని బొజ్జి కిరణ్ దీప్తి రాష్ట్రస్థాయి ప్రతిభ అవార్డుకు ఎంపికైంది. ఈమె 1000 మార్కులకు 983 మార్కులు సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాజు, ఎస్.జగ్గారావు, ఉపాధ్యాయులు ఆమెను ఆదివారం ఘనంగా సత్కరించారు.

మల్లంపాలెంలో శ్రమదానం



ఆలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు : మల్లంపాలెంలోని పెద పైడిమాంబ, శ్మశానవాటికలో ఆదివారం గ్రామస్తులు శ్రమదానం చేశారు. వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు, మహిళలు, యువకులు ఆయా పరిసరాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు తొలగించారు. చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో అమ్మవార్ల ఆలయాలు ప్రారంభం

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో మరిడమ్మ ఆలయ సమీపంలో గ్రామస్తులు, భక్తులు, సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయాలను ఆదివారం ప్రారంభించారు. పసర మోదమ్మ, భూలోకమ్మ ఆలయాలను వేద పండితులు ఆధ్వర్యంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ప్రారంభించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కల్యాణ వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 15వ వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడు, కో-కన్వీనర్లు పుట్టా రాంబాబు, పుట్టా బలరామ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. ఈ నెల 11న నాగవల్లి సంబరాలతో కల్యాణోత్సవాలు ముగిస్తాయని రామకొండలరావు తెలిపారు.

అంధకారంలో గొప్పూరు, కొండేంపూడి గ్రామాలు



నిరసన తెలుపుతున్న గొప్పూరు గిరిజనులు

చీడికాడ: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో రెండు గిరిజన గ్రామాలు నాలుగు రోజులుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మండలంలోని వి.బి.పేట శివారు కొండేంపూడి, గొప్పూరు గ్రామాలకు వి.బి.పేట నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. గత నాలుగు రోజులగా ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని గొప్పూరుకు చెందిన వార్డు నెంబర్ ఆగిరి రాము తెలిపారు. సమస్యపై లైన్‌మన్‌కు, విద్యుత్ ఏఈకి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేదన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోత, దోమలతో పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. చిన్న గాలి వేసినా, వర్షం కురిసినా రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారని గ్రామస్తులు సింగారపు పైడితల్లి, సింగారపు వెంకటస్వామి, గంగరాజు, బడ్డు సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మంగళాపురంలో మోదకొండమ్మ ఆలయ ప్రారంభోత్సవం



మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో మోదకొండమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా కలిసి గ్రామ శివారులో లక్షలాది రూపాయలతో మోదకొండమ్మ ఆలయంను నిర్మించారు. ఆదివారం వేదమంత్రాలు నడుమ శాస్త్రోక్తంగా పురోహితుల సమక్షంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ప్రత్యేక కుంకుమ పూజలు, వ్రతాలు, హోమాలు చేశారు. కుముదాంపేట, విజయరామరాజుపేట, మంగళాపురం, అప్పలరాజుపురం, సురవరం, తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేవారు. కోలాటం పోటీల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. రాత్రికి పలు భజన బృంద సభ్యులు భక్తి గీతాలు పాడి అలరించారు. సర్పంచ్ కంటే వెంకట్ పద్మరేఖ, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



శారదా గర్భంలో ప్రజలు రాకపోకలు సాగించే బాటను ఆనుకొని తవ్విన ప్రమాదకర గొయ్యిలు



తిమిరాంలో భారీ గొయ్యిలు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

ఇసుక తోడేళ్లు..!

- తిమిరారంలో 20 అడుగుల లోతున దర్జాగా తవ్వకాలు
- జిరాయితీ భూములకు ఆనుకుని తవ్వకాలతో రైతుల ఆందోళన
- ప్రమాదకరంగా మారిన భారీ గొయ్యిలు
- పట్టించుకోని పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు

దేవరాపల్లి: మండలంలో ఇసుక మాఫియా బరితెగించింది. ఉచిత ఇసుక పథకాన్ని ఆసరాగా చేసుకుని శారదానదిలో అడ్డుఅదుపూ లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా విస్తరించి ఉన్న శారదానదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక సంపదను దోచేస్తున్నారు. తిమిరాంలో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. తిమిరాం శివాలయానికి ఎదురుగా ఉన్న శారదానదిలో సుమారు 20 నుంచి 25 అడుగుల మేర లోతున భారీ గొయ్యిలు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. నదీ తీరంలో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతకు వందల సంఖ్యలో ప్రజలు, రైతులు, వ్యాపారులు తరలివస్తారు. తిమిరాం నుంచి మామిడిపల్లికి నీటి ప్రవాహం లేనప్పుడు శారదానది మీదుగా రాకపోకలు సాగిస్తారు. అయితే ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా భారీ గొయ్యిలు తవ్వేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు, రైతులు భయాందోళనలు చెందుతున్నారు. దీంతో పాటు శివాలయంకు ఎదురుగా ఉన్న జిరాయితీ భూములకు సమీపంలోని శారదానదిలో భారీ గోతులు తవ్వడంతో నది ప్రవాహ ఉధృతికి తమ పంట పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రజకులు బట్టలు ఉతికే ప్రాంతంలో సైతం విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. దూరంగా తవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ గోతిలో పడి ఓ యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన గతంలో చోటు చేసుకుంది.

ఈ నేపథ్యంలో మళ్లీ అదే ప్రాంతంలో కాలిబాటకు ఆనుకుని భారీ గొయ్యిలు ఏర్పాటు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో ఇటు తిమిరాం, అటు మామిడిపల్లి ప్రజలు సైతం ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

తక్షణం ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి..



తిమిరాం శివాలయం ఎదురుగా శారదానదికి సమీపంలో నా జిరాయితీ భూమి ఉంది. ఈ భూమిలో సిరి గంధం చెట్లు పెంపకం చేపట్టాను. తమ పొలానికి సమీపంలో భారీ గొయ్యిలు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో శారదానది ఉధృతంగా ప్రవహిస్తే లక్షలాది రూపాయలు విలువ చేసే సిరి గంధం చెట్లన్నీ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి తిమిరాం శివాలయంకు ఎదురుగా ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలి. కలెక్టర్‌కు కూడా తగు ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నాను.

– రెడ్డి సింహాద్రప్పుడు, రైతు, తిమిరాం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నిబంధనలను అతిక్రమించి ఇసు క తవ్వకాలు చేప డితే కఠిన చర్యలు తీసుకుంటాం. స్థానిక ప్రజలకు ఇబ్బంది కల్గించేలా భారీ గొయ్యిలు తవ్వితే సదరు వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తాం. తిమిరాంలో ఇసుక తవ్వకాలపై రెవెన్యూ సిబ్బందిని పంపించి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటాం.

– పి.లక్ష్మీదేవి, తహసీల్దార్, దేవరాపల్లి

యాంత్రీకరణతో సాగు లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

రావికమతం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో చినపాచిలి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతుల కందించే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో వివరించారు. బీపీటీ-2295, బీపీటీ-2846, ఎంటీయూ-1224, ఎంటీయూ-1262, ఎంటీయూ-1318 తదితర నూతన రకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి రూప, శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, కిషోరు కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేష్‌న్, పి.పద్మావతి, పి.బాబు, సర్పంచ్ కె.రామలక్ష్మి, వైస్ సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మండల టాపర్ రమాగాయత్రికి ప్రోత్సాహకం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

చోడవరం: బ్రాహ్మణుల సంక్షేమానికి గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఎంతగానో కృషి చేస్తుందని సంఘం అధ్యక్షుడు పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. చోడవరంలో సంఘ సర్వసభ్య సమావేశం సేవా ట్రస్టు గౌరవ అధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముందుగా గతేడాది బడ్జెట్‌లో జమా ఖర్చులు, ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్‌ను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన ఆత్రేయపురపు రమా గాయత్రిని, చుండూరు వంశీకృష్ణకి రూ.5వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహంతో ఘనంగా సత్కరించారు. రెండో స్థానంలో నిలిచిన పేరి ప్రహర్షితకు రూ.3వేలు అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వింజమూరి శంకర్, ప్రతినిధులు గోటేటి సీతారామయ్య, వారణాసి రామలింగశాస్త్రి, గుంటూరు సత్యనారాయణ, కందర్ప సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు విజయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం



మండపం పనులు జరుగుతున్న దృశ్యం

మాడుగుల: స్థానిక మూడు రోడ్ల కూడలిలో విజయాంజనేయ ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం గోపురం పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాతల విరాళాలతో ఆలయం పునః నిర్మాణంతో పాటు గోపురం, సీతారామలక్ష్మణ విగ్రహాల ఏర్పాటు జోరుగా సాగుతున్నాయి. ప్రారంభానికి అంతా సిద్ధం చేస్తున్నారు.

షైనింగ్ స్టార్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

మాడుగుల రూరల్: ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవోలు బి.దేముడమ్మ, పాండురంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. మాడుగుల సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల నుంచి ఆరుగురు, వీరనారాయణం హైస్కూలు నుంచి ఓ విద్యార్థి ఎంపికయ్యారని పేర్కొన్నారు. సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలు నుంచి ఎన్.చక్రవర్తుల గాయత్రీ లక్ష్మీ, నూతిగట్టు ప్రియాంక వందన, సాలాపురెడ్డి పూజిత, దశమంతురావు యజ్ఞోవందిత, ఓంద్రు అనుజా, గూడుపాటి శైలజిత్ జస్వీ, వీరనారాయణం హైస్కూల్‌కు చెందిన యల్లపు జశ్వంత్ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 9న అనకాపల్లిలో జరిగే అభినందన సభలో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, మంత్రుల చేతుల మీదుగా ఒక్కో విద్యార్థికి రూ.20 వేలు నగదు, గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తారని ఎంఈవోలు తెలిపారు.

కె.కోటపాడు : ఇటీవల పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డును ప్రకటించినట్లు మండల విద్యాశాఖాదికారులు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. గొండుపాలెం హైస్కూల్‌కు చెందిన సత్యవరపు శాంతి, జెడ్పీ హైస్కూల్ పాతవలసకు చెందిన కాకరాల అలేఖ్య, కె.కోటపాడు వేణు విద్యానికేతన్ పాఠశాలకు చెందిన కొట్యాడ భవాని, పొన్నగంటి జశ్వంత్, జాగరపు దుర్గా హేమని అవార్డుకు ఎంపికైనట్టు చెప్పారు.

రోలుగుంట: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 9న జిల్లా కేంద్రం అనకాపల్లిలో షైనింగ్ స్టార్ అవార్డు ప్రదానం చేయనున్నట్టు ఎంఈవోలు జానుప్రసాద్, పి.జగ్గారావు తెలిపారు. మండలంలో 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలుండగా.. బీబీ పట్నం నుంచి చింతల రామకృష్ణ, కొంతలం నుంచి నిట్టా యస్వంత్, చీడిపల్లి కళ్యాణి, కేజీబీవీ నుంచి గాలి లాస్య, రోలుగుంట నుంచి బేతా బేబీ శ్రీలత ఎంపికైన వారిలో ఉన్నారన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. గుంపాన ఉదయ్‌కుమార్, మురుకుతి దేవానంద్, చెరుకూరి మౌనిష, శ్రీనాథ జయకృష్ణ, పెంట జయశ్యాం కుమార్, బి.హర్షిత ఎంపికయ్యారు. వారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చోడవరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పతంజలి యోగా కేంద్రం గురువు, రాష్ట్ర యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లేటి సతీష్ అన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చోడవరం పట్టణంలో యోగాపై అవగాహన కల్పిస్తూ ఆదివారం ర్యాలీ, మానవహారం చేపట్టారు. అంతకు ముందు గాంధీ గ్రామంలో సర్పంచ్ గాడి అప్పారావు, యోగా మాస్టారు భోగవిల్లి గణేష్ ఆధ్వర్యంలో గ్రామంలో యువతకు యోగాసనాలు నేర్పించారు. అనంతరం గాంధీగ్రామం నుంచి మెయిన్‌రోడ్డుపై కాలేజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి మీదుగా కొత్తూరు జంక్షన్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని యోగా గురువు సతీష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మండల పంచాయతీ విస్తరణ అధికారి ఓ.మహేష్, పంచాయతీ కార్యదర్శి రామునాయుడు, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో యోగాంధ్ర ర్యాలీ నేడు

మాడుగుల: స్థానిక పాత బస్టాండ్ వద్ద సోమవారం ఉదయం 6.30 గంటలకు యోగాంధ్ర ర్యాలీ జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

పిడుగు కాదు.. విద్యుదాఘాతం.!



విద్యుదాఘాతానికి గురై కాలిపోతున్న కొబ్బరి చెట్టు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్(ఎన్టీఎస్) దగ్గరలో విద్యుదాఘాతంతో ఓ కొబ్బరిచెట్టు దగ్ధమైంది. ఆదివారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ తీగలు కలిసిపోయి పక్కనున్న కొబ్బరిచెట్టుకు తగిలాయి. షార్ట్ సర్క్యూట్‌తో కొబ్బరి చెట్టుపై మంటలు వ్యాపించాయి. పిడుగు పడ్డ విధంగా చెట్టంతా కాలిపోయింది. పాఠశాల దగ్గరలో విద్యుత్ వైర్లు వేలాడుతూ మంటలు వ్యాపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో వడ్డాది జంక్షన్‌లోనే నివాసం ఉంటున్న ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి ఇంటిపై ఆడుకుంటూ వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాడు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను మార్పు చేసి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

రాజాంలో 352 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చెయ్యపేట: మండలంలోని రాజాం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజాంకు చెందిన యువకులు, వీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విశాఖ మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పాల్, మురళీకృష్ణ, హారిక, ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు పరమేశ్వరరావు, హరి కిషోర్, సుజిత్ కుమార్, సౌమ్య, హేమంత్, సుజాత, తదితరులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 352 మంది రోగులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. పలువురికి గుండె సంబంధిత పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించారు. యువకులు కోట శేషు, అమర్, సుంకర దేవి ప్రసాద్, జెర్రిపోతుల నాయుడు, రమణ, మరిసా సూరిదేముడు, బుజ్జి, నగేష్ తదితరులు శిబిరంలో సేవలు అందించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక



బూరుగుపాలెంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



వడ్డాదిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో ఉత్సాహంగా సాగింది. మండలంలోని బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో 2004-05 ఏడాదిలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తమ పాఠశాలలో సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఒకరికి ఒకరు యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో సుమారు 80 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాదిలో..

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో సందడి చేశారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు దొండా నరేష్, రమేష్, దూది రాజేష్, చప్పా వెంకటేష్, కిషోర్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



నాతవరం హైస్కూల్‌లో గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నాతవరంలో..

నాతవరం: మండల కేంద్రం నాతవరం హైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అప్పట్లో చదువు చెప్పిన గురువు సాయికి రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడంతో ఘనంగా సత్కరించారు. హైస్కూల్‌కు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశంలో తీర్మానించుకున్నారు. అనంతరం హైస్కూల్‌లో సరస్వతిదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కూండ్రపు సత్యనారాయణ, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన్నబాబు, జగన్నాథరావు, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- రాజన్నపేటలో గత నెలలో ఆక్రమించి రోడ్డును తొలగించిన తహసీల్దార్
- తాజాగా మళ్లీ రోడ్డు ఏర్పాటు చేసిన కూటమి నాయకుడు
- క్వారీ అనుమతి రద్దు చేయాలంటున్న జనసేన ఇన్‌చార్జి రాజు



మే నెలలో రాజన్నపేటలో చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన రోడ్డును తొలగించి ట్రెంచ్‌లు వేయించిన తహసీల్దార్ నాగమ్మ(ఫైల్)



తవ్వేసిన ప్రాంతంలోనే గ్రావెల్‌తో కప్పి రవాణాకు అనువుగా ఏర్పాటు చేసిన రోడ్డు

రోలుగుంట: రాజన్నపేట సమీపంలో క్వారీ నుంచి అక్రమంగా రాయి తరలింపు కోసం చెరువు గర్భంలో కూటమి నాయకుడు అనధికార రహదారి ఏర్పాటు చేశాడు. దీంతో సమీపంలోని రైతులు తమ భూములకు చెరువు నుంచి నీరు రాకుండా అక్రమంగా రోడ్డు ఏర్పాటుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మూడు మాసాల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన చోడవరం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. మండలంలో పలు క్వారీలను కూడా పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మండల్ సర్వేయర్ నాయుడు, ఆర్ఐ రామమూర్తితో వచ్చి 57/2 సర్వే నంబరు, తదితర నంబర్లను పరిశీలించారు. గత నెల 8న పొక్లెయిన్‌తో చెరువులో వేసిన రోడ్డును తొలగించి, ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. నిర్వాహకుడికి నిబంధనలు అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు నివేదించి క్వారీ అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నెల రోజుల పాటు సైలెంట్‌గా ఉండి తాజా మళ్లీ రోడ్డు ఏర్పాటు చేశారు. విషయం రైతుల ద్వారా తెలుసుకు న్న పి.వి.ఎస్.ఎన్.రాజు సంఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణాన్ని తొలగించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్యుతాపురం రూరల్: స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో ఒకటో తగరతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఉచితంగా విద్య, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 35 సంవత్సరాలుగా ఆహ్లాదకర వాతావరణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని వసతి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9989719158, 7032054123 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.